స్కెచ్

# ఎవరికథ రాయను?

యం. హీరాలాల్ రాయ్

కథలు రాయక చాలారోజులైంది. ఏదన్నా రాసితీరాలని మనస్సు ఆరాటపడుతూంటే మెదడుని ప్రతిక్షణం యేదో ఒక ఆలోచన ఆక్రమించుకునే వుంటున్నది. కాని, 'ఏం కథ రాయాలి' అన్నది మాత్రం తోచడం లేదు. రాయదల్చుకుంటే చాలుగాని; ఎన్నో రీతుల్లో ఎన్నో కథలు రాయవచ్చు. ప్రతిమనిషి అట్టడుగు జీవితానికి సంబంధించిన విషయాలు తీసుకుని లక్ష రాయొచ్చు. ఐనా, ఇవాళేదన్నా ఒక విచిత్రమైన కథ రాయాలనిపిస్తోంది.

ఎండ నిప్పులు చెరుగుతున్నది. వడగాడ్పులు వీస్తున్నాయి. కథ రాయడాని కనుకూలమైన వాతావరణం లేదు. దురదృష్టవిశాత్తూ మా యిల్లు మెయిన్‌రోడ్డు పక్కనే వుండటాన క్రతి క్షణం విసుగూ విరామం లేకుండా తిరిగే మోటార్ల భయంకర ధ్వని చాలా భాగం నా ఆలోచనలని కల్లోలపరుస్తుంటుంది. రంయ్ మంటూ ఒక మోటారు వెళ్లిపోగానే, వెనకనుంచి రెండో మోటారు వస్తున్నట్లుగా, ఆలోచనలు కూడా, ఒకదానివెంట మరోటి గొలుసులా వచ్చి పడుతుంటాయి. కాని స్థిరంగావుండవు. ఈ మోటార్లు వెళిపోయేవి వాటిమానాన అవి పోవు. పైగా, విపరీతమైన దుమ్మును రేపి మరీ వెళతాయి-యీ ధూళికణాలు యింట్లోకి ప్రవేశించడమేగాక కళ్ళల్లో, చెవుల్లో దూరి, కాగితాల నిండా పేరుకుని, ప్రాణాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. సరే ఇంత శ్రమకూడా ఓర్చుకుని, ఏదన్నా రాద్దామని దీక్షగా కూర్చుంటే అమాంతం యెవడో ఒకడు దూకి పడతాడు.

ఈ జర్నలిజం పంకంలో అస్మదాదులం యిరుక్కున్నందువల్ల అందరికీ యేదో ఒక పని వుంటూనే వుంటుంది. "మొన్న మా వూళ్ళో ఓ అమ్మాయి బావిలోపడి చచ్చిపోయింది దీని వెనక బోలెడంత గ్రంథం వుందనీ; మా భూమిని, గూండాల సహాయంతో భూస్వామి ఆక్రమించుకున్నాడనీ, మునిసిపాలిటీ వాళ్ళ పన్నులు భరించ లేకుండా వున్నామనీ, ఫలానా ఇనస్పెక్టర్, రోడ్డుపక్కన పళ్ళ వ్యాపారం చేసుకునేవాళ్ళని బెదిరించి తలో పదిరూపాయలు లంచం అడిగాడనీ ఇలా తలో సమస్యనీ నెత్తికెత్తుకుని వచ్చి, దింపి మరీ వెళతారు. వీళ్లందరి సంగతి అలా వుంచితే—ఇంకో పెద్దమనిషి మోటార్లోంచి అమాంతం దూకి, "మొన్న జరిగిన మా బహిరంగ సభ వార్త యింకా పత్రికల్లో రాలేదేం?" అని ప్రశ్నిస్తాడు. కీర్తి కండూతితో అధికంగా బాధపడే రాజకీయ నాయకులతో ఒకోసారి తలప్రాణం తోకకు వస్తుంది. ఒక్క బహిరంగ సభలో మాట్లాడి మహా నాయకుల మనుకుంటారు వీళ్లు. ఫలానా మీటింగ్‌కి వంద మందిమాత్రమే ప్రేక్షకులు వచ్చారని వున్నదున్నట్టు రాస్తే "వేయిమందని రాస్తే నీ సొమ్మేం పోయిందయ్యా?" అని చీత్కరిస్తారు.

పత్రికలో వార్తగానీ, వ్యాసంగానీ రావడంతోటే తమతమ సమస్యలన్నీ తీరిపోతాయన్నంత ఆదుర్దాతో వుండేవాళ్ళ సంఖ్య అధికతరం. ఇవన్నీ నిత్యకృత్యాలకింద మారిపోయాయి. ఒక్కసారి తల్చుకుంటే వీళ్ళంతా నన్ను భయంకరంగా పరిహసిస్తున్నారా లేక నేను వీళ్ళ వాంఛలతో ఆడుకుంటున్నా అనిపిస్తుంటుంది.

సోషక వర్కర్ లాంటివాడు జర్నలిస్టు కూడా. న్యాయంగా అంతే. సమాజంలో, వాతావరణంలో అతను మహోన్నత స్థాయికి చెందిన పరిణామాలు తేలేకున్నా ప్రస్తుత దరిద్రవ్యవస్థని మాత్రం దెబ్బకొట్టగల సమర్థుడు. ఆలాంటి జర్నలిస్టుని, ఇవాళ రేపటి రాజకీయ నాయకులు ఒక సిగరెట్టుగా భావించుకోవడం దురదృష్టం కాదూ?

జర్నలిస్టు; పరిస్థితులన్నిటినీ యథాతథంగా

చిత్రించేమాటుంటే, యీ రాజకీయయోధులకూ, ప్రభుత్వానికీకూడా గంగవెర్రులెత్తుతాయి. ప్రధానంగా, అభ్యుదయవాదులమంటూ ఇవాళా రేపూ చెప్పుకుతిరిగే వాళ్ళనిగురించిన పచ్చినిజాలు రాసేమాటుంటే వాళ్ళు ఒకటే కాకిగోల మొదలెడతారు. ఇవన్నీ శుద్ధాబద్ధాలనీ, అభ్యుదయోద్యమాన్ని బదనాం చేయాలని చూసేవాళ్ళంతా అభ్యుదయ నిరోధకులనీ, ఇంకా ప్రభుత్వతొత్తనీ ప్రచారం చేస్తారు. వీలైతే తమను పొగడుతూ పత్రికల్లో రాయాలిగాని, రహస్యంగా తాము సాగించే పనులని గురించిరాస్తే పరువు దక్కదని శాసిస్తారు. అలా రాసేవాళ్ళని పబ్లిక్‌గా భయపెడతారు.

ఏదేమైనా, ఏ రాజకీయపక్షానికి సంబంధించినిదైనా, వున్నపరిస్థితిని రాయడం మొదటినుంచీ నా అలవాటు మాత్రమేగాక బాధ్యతగా కూడా పరిగణిస్తాను. ఎప్పుడు వీలైతే అప్పుడు జర్నలిస్టుని సిగరెట్టులా వెలిగించుకోవచ్చుననే మనస్తత్వంగల రాజకీయ మేధావులనిచూస్తుంటే చెడ్డరోత వేస్తుంది. ఈ జాతీయోధులు, ఏ కొద్ది విజయాన్ని ఎవరిపరంగా పొందినా, దానికి కారకులం తామేననీ, తాము దేవుడి తమ్ముళ్ళమని అనుకుంటారు. అభ్యుదయవాదుల సంగతి సరేసరి. ఇదివరకు చచ్చిపోయిన వాళ్ళ మహానాయకుడికివాళ్ళల్లో ఒక్కొక్కడూ వారసుడేనంటారు.

వృత్తిధర్మ నిర్వహణలో ఈమధ్య బహిరంగ సభకి వెళ్ళవలసి వచ్చింది. కరపత్రాల్లో ప్రకటించబడిన నాయకశిఖామణీ, వారి కార్యక్రమాలూ అలావుంచి ముందు విషమపరిస్థితి నెదుర్కోవలసివచ్చింది. ప్రప్రథమంగా ఎవరో ఉపన్యాసకుడు వేదికనెక్కి, చేతులు రెండూ పక్షి రెక్కల్లా ఆడిస్తూ, ఏదో బడబడ మాట్లాడేస్తున్నాడు. కరపత్రంలో ప్రకటించబడ్డ కార్యక్రమానికీ, ఈ వ్యక్తి ఉపన్యాస విషయానికి ఎన్నోమైళ్ళదూరం ఏర్పడిపోయింది. తనశారీరక పరిస్థితినీ అజాగ్రతలనీ గమనించనంత ఆవేశంతో మాట్లాడే అది ఉపన్యాసమో, అవసరమో, దేని గురించో మాత్రం ఎవ్వడికీ అర్థం కాలేదంటే నమ్మండి! అతనేం చెప్పదల్చుకున్నాడో కూడా గ్రహించలేక పోతున్నారు ప్రజలు! "ఈయన ఎవరు?" అని పక్కనున్న వాలంటీర్ని నేనే అడిగాను. "ప్రభుత్వంతో రహస్యజీవితం గడుపుతూనే నిన్నటివరకూ హోరాహోరీగా పోట్లాడిన మన జిల్లా వీరయోధుడు ఫలానా" అని చెప్పాడు. వలంటీరు తన్మయత్వంతో.

ఇంట్లోకూర్చున్న నాకు ఆనాటి బహిరంగ సభానాయకుడి రూపం కనిపిస్తున్నది. ఈ భయంకర మహోపన్యాసం యథాతథంగా పత్రికల్లో రాకూడదట, చాలా మంచి పద్ధతిలో ఎడిట్ చేసి, జర్నలిస్టు ఆయన్ని పొగడుతూ పత్రికలో రాయాలట...

"అబ్బ! ఏమిటీ గొడవ? ఇవాళేదన్నా గొప్ప ప్రేమకథ రాయాలని కూర్చున్న నాకీ ఆలోచనలు వస్తున్నాయేం?" కారణాన్ని గురించి ఆలోచిస్తుండగానే బయట దర్వాజాలో దర్జీ నిలబడి "బాబూ! ఇదిగో తమషర్టు" అన్నాడు.

ఆలోచనలకి అమాంతం బ్రేక్ పడింది. షర్టుని చూస్తూ "కూలీ యెంత?" అన్నాను. దర్జీ వినయంగా "తమదయ" అన్నాడు.

"అరె! ఇందులో నా దయమీద ఆధారపడేదేముంది? కష్టానికితగిన ప్రతిఫలం పుచ్చుకోవడం నీ హక్కు" అన్నాను నేను.

"అలా అనకండి బాబూ! కూలి ఎవరు సరిగ్గా యిస్తున్నారని? నెలకి వెయ్యిరూపాయలు సంపాయించే అధికారి ఫుల్ షర్టు కూలీ ఒక్కరూపాయండీ అంటే గందరగోళం చేస్తారు. చివరికి వారి కిష్టమైనంత పారేస్తారు...అంతా అంతే బాబూ!" అన్నాడు.

నేను మౌనంగా వింటున్నాను.

"అసలు మాదర్జీ వృత్తే దరిద్రం బాబూ! మా వయస్సంతా ఈ షర్టులూ, పంట్లాలూ, బ్లౌజులూ, జాకెట్లకే అర్పితం. కష్టంచేసినా ప్రతిఫలం సరీగా దొరకదు. పొద్దస్తమానం పనిచేసే మా కుర్రాడికి మళ్ళీ చినిగినబట్టలే గతి" అన్నాడు దర్జీ నిరాశగా.

ఇక అతన్ని నిలబెట్టలేక రూపాయిచ్చేశాను. కృతజ్ఞతాపూర్వకంగా ఒక్క నమస్కారంచేసి వెళ్ళిపోయాడు

దర్జీ మాటల్లో ఈ వూళ్ళోవున్న వందలాది కుట్టుపనివాళ్ళూ, వాళ్ళ కుటుంబాలూ, ఇళ్ళల్లో

పొగరాజని రోజులూ, అన్నీ వరసాగా కళ్ళ ముందు కొచ్చేసినాయ్. అస్తమానం కష్టపడ్డా ఆకలితో చావడమేనా యీ దేశంలో అందరి పనీ? చచ్చింతరవాత మీదకప్పే గుడ్డపేలిక కోసరంకూడా యాచనేనా వీళ్ళకి? ప్చ్...... తోచడంలేదు. ఈ రాజకీయవేత్తలు సాగించే గంభీరోపన్యాలూ, ప్రణాలికలూ, ఘనకార్యాలూ, అంచనాలని మించిన ఉత్పత్తులూ, యేమవుతున్నాయి? ఎక్కడున్నాయి? ఎవణ్ణిచూచినా తిండికి చస్తున్నామనే రొదే. ఎలా యిది మరి?

నిజంగా యీ రాజకీయ వ్యక్తుల్లాంటి చీడపురుగులూ, వీళ్ళంత దుర్నీతిపరులూ, ఇంకెవరూ వేరేమో ననిపిస్తుంది. వీళ్ళు ధనవంతుల్ని "చాప్లూసీ" చేసి బాకాలూత్తారు. బోలెడు విరాళాలు వసూలుచేసుకుని, లోపల్లోపల వాళ్ళకి విపరీతలాభాలు సృష్టించి పెడతారు. బయటికి శుష్కవాగ్దానాలుచేస్తూ, పేదవాళ్ళనిలోబరుచుకుని వాళ్ళచేత చచ్చేట్టు చాకిరీ చేయించుకుంటారు. అబ్బ...ఇలాంటి రాజకీయనాయకుల్లేకుంటేనే మనదేశం బాగుండేదేమో?

వీళ్ళ కారణంగా, యీ ఒక్క దర్జీ సులేమాన్ ఖానేకాదు. ఇలాంటి మనుషులు వేలమంది వాడిపోలున ముఖాల్తో, గాంధీ చౌకువగ్గర క్షణంసేపు నిలపడితేచాలు, దర్శనమిస్తారు. సన్నని పూచ కాళ్ళూ, కర్రపుల్లల్లాంటి చేతులూ, చూస్తూంటే జాలివేస్తుంది మనకు. కాని, భగవంతుడికి జాలిలేకపోతూన్నది...ఆలోచనీయాంశం...

ఈదేశంలో కష్టపడేదొకడూ, కడుపు నింపుకునేవొకడూను. ఖూనీ చేసేవాడొకడైతే, శిక్షననుభవించేది మరో దురదృష్ట జాతకుడు. హంతకుడు మహానాయకుడుగా, విప్లవ శిఖిగా భాసిస్తాడు. మానమూర్తి దేశద్రోహిగా పరిగణింపబడతాడు. ఇంతగా ఆపభ్రంశం అయిపోయిన పరిస్థితుల్ని గురించి యేం ఆలోచించాలి? కళ్ళముందు కనిపించే యిలాంటి నగ్న సత్యాలు వదిలి ఇంకేవో రాస్తే యేంప్రయోజనం అనిపిస్తుంది...?

"ఏమయ్యోయ్! కాఫీ చల్లారిపోతోంది. ఇందాకణ్ణించీ అరుస్తుంటే వినపట్టంలా!" ఒక్కసారి విరుచుకపడింది మా వదిన. "వస్తున్నాను పద" అన్నాను చిరాగ్గా ఆలోచనల వలయం తెగిపోయినందుకు. "రమ్మంటే..." తీక్షణంగా చూసి వెళ్ళిపోయింది వదిన.

ఆవిడ ఫస్టువార్నింగిచ్చి వెళ్ళిందోలేదో, ఈమారు వారంటుపుచ్చుకుని, మా వదినగారి సైన్యం హడావిడిగా ప్రవేశించింది. "లీబాబాయ్" అంటూ....

వీళ్ళ భవిష్యత్తునిగురించి నాకు భయం అవుతుంది. బిచ్చమెత్తుకోకుండా వీళ్ళు బతకడం యెలా సాధ్యమా అని నా ఆలోచన. "మీరిద్దరూ కూడ బలుక్కుని ఈ ఉత్పత్తిని ఆపండి! లేదూ, ఎవళ్ళన్నా లక్షాధికార్లకి తలా ఒకణ్ణి పెంపకం ఇచ్చెయ్యండి" అని మా అన్నయ్యకీ వదినెకీ అప్పుడప్పుడూ సలహా యిస్తుంటాను.

మా ప్రాంతాల్లో పెంపకాలపద్ధతి బలే విచిత్ర పద్ధతిలో వుంటాయి. మావూళ్ళో మిల్ ఓనర్లూ, బడాసేట్లూ, అంతా దాదాపు దత్తపుత్రులే. వీళ్ళంతా వెనక కూటికీ గుడ్డకూ కరువైనవాళ్ళే అయినప్పటికీ, పేదవాళ్ళంటే ఇప్పుడు కించిత్తు సానుభూతికూడా చూపరు. ఏదన్నా సత్కార్యం కోసం చిల్లిగవ్వ ఖర్చుపెట్టరు. పెద్దవాళ్ళు ఒక్క రూపాయ చందాను గొణుక్కుంటూ ఇవ్వవస్తే, ఈ దత్తపుత్రమహాశయుడు ఆపి, పావలాతో బేరం ఫైసలాచేసి వదుల్తాడు.

"కోరినన్ని చందాలు తెచ్చివ్వగలమటండీ? అలాయిస్తే మేం ముష్టెత్తుకోవాల్సిందే" నంటారు పైపెచ్చు. వీళ్లల్లో ఏభాగంలోనూ జాలి అనేది వెదికిచూసినా దొరకదు. అయాచితంగా సంక్రమించిన ఆస్తులతో వీళ్ళంతా క్రూరులుగా తయారవుతారు. మా అన్నయ్య పిల్లలుకూడా బతకాలంటే అలాంటిచోట్లకే పెంపుడివ్వాలి.

ఇంట్లో విప్లవం ఆరంభమయే సూచనలు కనిపిస్తున్నాయి. ఈమారు ప్రత్యేకం మా ఆఫీసరే (అన్నయ్య) బయల్దేరి వస్తాడేమోనని భయంతో కాగితాలు బల్లమీద పారేసి, కథకో సలాం పెట్టి కాఫీకోసం ఇంట్లో ప్రవేశించాను.

ఇన్ని అవరోధాలూ ఆలోచనల్తో నేను ఎవరి కథ రాయను? ఏంకథ రాయాలి?